కథ

# అతడు - ఆమె - ఇంటర్‌నెట్

అది నాంపల్లి రైల్వే స్టేషన్.

సమయం ఉదయం ఆరున్నర గంటలవుతోంది.

''హైదరాబాద్ నుంచి కొత్త ఢిల్లీ వెళ్లవలసిన ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రెండవ నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్నది'' అని మైక్ నుంచి ప్రకటన వినపడుతోంది.

తనకి వీడ్కోలు చెప్పడానికి వస్తానన్న మిత్రుడు సందీప్ కోసం అసహనంగా ఎదురు చూస్తున్నాడు నవీన్.

ఇంతలో దూరం నుంచి చెయ్యి ఊపుతూ వచ్చాడు సందీప్.

''ఏరా, ఇంత ఆలస్యమైంది? ఇంకాసేపు అయితే బండి బయల్దేరిపోయేది?'' అన్నాడు నవీన్.

''ఏం చేయను బాస్, రాత్రి ఇంటర్నెట్ ధాబాలో బాగా ఆలస్యం అయ్యింది. మనం చూసే మసాలా వెబ్‌సైట్‌లో కొత్త అప్‌డేట్లు వచ్చాయి. వాటిని పూర్తిగా చూసి ఇంటికి వెళ్లేసరికి పదకొండు గంటలైంది. దాంతో పొద్దున్నే నిద్రలేవడం కొంచెం కష్టమైంది'' అంటూ తాను తెచ్చిన డెక్కన్ క్రానికల్ పేపరును నవీన్ చేతిలో పెట్టాడు సందీప్.

''అప్‌డేట్లు ఎలా ఉన్నాయి? గిట్టుబాటవుతాయా?'' ఆసక్తిగా అడిగాడు నవీన్.

''అదిరాయనుకో, అయినా నువ్వు ఓ వారంలో తిరిగి వచ్చేస్తావుగా, అప్పుడు చూద్దూ గాని. లేకపోతే ఢిల్లీలో ఏదైనా ఇంటర్నెట్ ధాబాకి వెళ్లు'' అని సలహా ఇచ్చాడు సందీప్.

అలాగేనన్నట్లు తలూపుతూ...''ఏమైనా ఇన్ని గంటల ప్రయాణం విసుగేరా'' అన్నాడు నవీన్.

''ఫస్ట్‌క్లాసులో ప్రయాణం చేస్తున్నావు. పైగా ఏవో నవలలు, ఇంకా వాక్‌మన్ తీసుకువెడుతున్నావు. మరిక విసుగెందుకు గురూ...'' అంటూ ''నీ సీట్ నంబర్ ఎంత?'' అని అడిగాడు సందీప్.

''ముప్పై ఆరు'' చెప్పాడు నవీన్.

సందీప్ వెంటనే బోగీలోకి ఎక్కి చూసి వచ్చి 'నువ్వు లక్కీ ఫెలోవిరా! నీ ఎదురుసీట్లో ఓ చక్కనిచుక్క ఉంది. ఇక నువ్వు ప్రయాణాన్ని హాయిగా ఎంజాయ్ చేయవచ్చు.'' అన్నాడు.

''అవునా? నేను గమనించలేదే?'' అంటూ బోగీలోకి తొంగిచూశాడు నవీన్. అక్కడ తన సీటుకి ఎదురుగా ఓ అమ్మాయి, ఓ ముసలాయన కూర్చుని ఉన్నారు. బెంగాల్ కాటన్ చీరలో ఆ అమ్మాయి హుందాగా ఉంది.

''వావ్! స్టన్నింగ్ బ్యూటీరోయ్'' అన్నాడు నవీన్ లోగొంతుకతో. ఇంతలో బండి బయల్దేరుతోందని మైక్‌లో ప్రకటన రావడం, మరికొద్ది నిముషాలకే బండి బయల్దేరడం జరిగింది.

సందీప్ నవీన్‌కేసి చేతులూపి వీడ్కోలు చెప్పాడు.

రైలు మెల్లగా వేగం పుంజుకోవడంతో బోగీ తలుపు దగ్గర నుంచి కదిలి, తన సీట్‌లో కూర్చున్నాడు నవీన్. బాగ్‌లోంచి వాక్‌మెన్ బయటకు తీసి, రికీమార్టిన్ పాడిన 'ఉల్వే' అనే పాటల క్యాసెట్ దాంట్లో పెట్టాడు. చెవులకి ఇయర్‌ఫోన్స్ తగిలించుకుని టేప్ ఆన్ చేసాడు. ఆ పాటకి తగ్గట్టుగా, కాళ్లని లయబద్ధంగా కదపసాగాడు.

సభ్యత కాదని తెలిసినా, ఆ అమ్మాయి వైపు దొంగచూపులు చూడసాగాడు. రెండు రోజుల క్రితం టీవీలో చూసిన 'రంభా ఊర్వశి తలదన్నే రమణీ లలామ ఎవరీమె?' అనే పాత సినిమా పాట అతడి పెదాలపై ఆడసాగింది.

ఆ అమ్మాయి పొందికగా కూర్చుని, 'బార్న్ టూ విన్' బుక్ చదువుకుంటోంది. పక్కన కూర్చున్న ముసలాయన నవీన్ చేతిలోని దినపత్రికని అడిగి తీసుకుని తీరిగ్గా చదవడం ప్రారంభించాడు.

ఆ అమ్మాయి ఏదో పుస్తకం చదువుతోంది కదా.. అని తనూ ఓ ఇంగ్లీష్ నవల బయటకు తీసాడు నవీన్. దాన్ని చదువుతున్నట్టు నటిస్తూ, ఆమె అందాన్ని కళ్లతోనే ఆస్వాదించసాగాడు. అతడి చూపులు ఆమె శరీరాన్ని తడుముతున్నాయి.

''ఆహా, ఎంత అందంగా ఉంది! అన్ని అవయవాలు ఏరికూర్చి అమర్చినట్లుగా ఉన్నాయి. పర్‌ఫెక్ట్ ఫిగర్! ఈమెని పెళ్లి చేసుకునేవాడు అదృష్టవంతుడు'' అని అనుకున్నాడు.

''మేరే సామ్నే వాలీ కిడికీ మే ఏక్ చాంద్‌కా తుకడా రహతాహై...'' అనే హిందీ పాటని, ఆమెకి మాత్రమే వినపడేలా లో గొంతుకతో పాడసాగాడు.

ఆ అమ్మాయి ఇవేవీ పట్టించుకోకుండా దీక్షగా పుస్తకం చదువుతోంది. ముసలాయన దినపత్రికను ఆమూలాగ్రం చదివితేగాని వదిలేట్టుగా లేడు.

కొద్దిసేపటికి రైలు కాజీపేట స్టేషన్‌లో ఆగింది. కాఫీ, టీ, టిఫిన్లు అమ్మేవాళ్ళు కేకలతో స్టేషన్ అంతా హడావిడిగా ఉంది.

''ఏమ్మా, కాఫీ తాగుదామా?'' ఆ అమ్మాయిని అడిగారు ముసలాయన.

''అలాగే తాతయ్యా'' అంటూ పుస్తకం మూసి, ఎదురుగా కూర్చున్న నవీన్‌ని చూసి పలకరింపుగా నవ్వింది ఆ అమ్మాయి. బదులుగా...

''హాయ్! ఐ యామ్ నవీన్'' చెప్పాడు నవీన్.

''నా పేరు విద్య'' అందా అమ్మాయి.

ప్లాట్‌ఫారంపై అమ్ముతున్న పెప్సీ టిన్ కొని, కొద్దికొద్దిగా తాగుతూ''ఎక్కడిదాక వెళుతున్నారు?'' అని విద్యని అడిగాడు నవీన్.

''నాగ్‌పూర్‌కి'' అని చెప్పి తాతయ్య తెచ్చిన కాఫీ తాగడం మొదలుపెట్టింది విద్య.

రైలు మళ్లీ బయల్దేరింది.

కాఫీ తాగేసి, తిరిగి పుస్తకంలో తల దూర్చబోయింది విద్య. ఆమె పుస్తకం చదవడంలో నిమగ్నమైతే తనతో మాట్లాడదని గ్రహించిన నవీన్ సంభాషణని పొడిగించసాగాడు.

''విద్యా, మీరు ఏం చదువుతున్నారు?'' అని అడిగాడు.

''నేను విజువల్ ఆర్ట్స్‌లో పీజీ చేశాను. మరి మీరో?'' అంది విద్య.

''నాది ఈమధ్యే డిగ్రీ పూర్తయింది. ఎంబీఏ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్నాను. మెటీరియల్ కోసం ఢిల్లీ వెళుతున్నాను.'' చెప్పాడు నవీన్. అతడి మాటల్లో దర్పం ధ్వనించింది.

''ఆహా, అలాగా'' అంటూ పుస్తకం తెరవబోయింది విద్య.

''మీ హాబీస్ ఏమిటి?'' అని అడిగాడు నవీన్.

''పెయింటింగ్, రీడింగ్'' చెప్పింది విద్య.

''ఐసీ, ఐ టూ లైక్ రీడింగ్. అందులోనూ సైన్సు ఫిక్షన్ అంటే మరీ ఇష్టం. పోతే ఇంటర్నెట్ బ్రౌజింగ్ మరో హాబీ'' చెప్పాడు నవీన్.

''అలాగా, మీరు 'ఫ్రం ది ఎర్త్ టు ది మూన్' చదివారా?'' అని అడిగింది విద్య.

లేదన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు నవీన్.

''పోనీ, 'జర్నీ టు ది సెంటర్ ఆఫ్ ఎర్త్' చదివారా?'' అని అడిగింది విద్య.

మళ్లీ ఇంకోసారి తల అడ్డంగా ఊపాడు నవీన్. నిజానికి ఆ పుస్తకాల పేర్లు కూడా వినలేదతను.



అయినా,

ఆమె ముందు గొప్పలు పోవడం కోసం ''లేదండి, నాకు పెద్దగా టైం దొరకదు. అందుకని ఇష్టం ఉన్నా వాటిని చదవలేకపోయాను...'' అంటూ అందంగా అబద్ధం చెప్పాడు.

అతడి డాంబికాన్ని పసిగట్టిన విద్య మారు మాట్లాడకుండా పుస్తకం చదువుకోసాగింది.

రైలు గాలిని చీల్చుకుంటూ వేగంగా ప్రయాణి స్తోంది.

ఇంతలో ఇద్దరు వ్యక్తులు వచ్చి భోజనాలకు ఆర్డర్ తీసుకోసాగారు. నవీన్ తనకు కావాల్సిన పదా ర్థాలు చెప్పాడు. ఎదురుగా కూర్చున్న ఇద్దరూ ఏమీ ఆర్డర్ ఇవ్వలేదు.

మధ్యాహ్నం భోజన సమయం అయింది.

''భోజనం చేద్దాం అమ్మా...'' అంటూ తాతయ్య

వాళ్ళు తెచ్చుకున్న క్యారేజీ అందుకున్నారు.

''చేతులు కడుక్కుని వస్తాను తాతయ్యా..'' అని విద్య లేచి వాష్ బేసిన్‌వైపు వెళ్ళింది. ఆమె వెళుతుంటే ఆమెని చూసి నివ్వెరపో యాడు నవీన్. ఎందుకంటే ఆమె కుంటుతూ నడుస్తోంది. ఆమె ఎడమకాలికి రబ్బరు పాదం ఉంది.

అంతే, నవీన్ ముఖం వివర్ణమైంది. అప్పటి దాకా అతడి మనసులో ఆమె పట్ల ఉన్న మోహపు భావనలు మాయమై వాటి స్థానంలో జాలి చోటు చేసుకుంది.

'అయ్యో, ఇంత అందమైన అమ్మాయికి ఈ లోపం ఏమిటి? ఆడపిల్లలకి అంగవైకల్యం ఉంటే పెళ్లి ఎలా జరుగుతుంది? అన్ని అవయవాలు సక్ర మంగా ఉన్నవారే బ్రతకడం కష్టంగా ఉన్న ఈ రోజు ల్లో ఈ అమ్మాయి పరిస్థితి ఏమవుతుందో..' అని స్వగతంలో అనుకోసాగాడు నవీన్.

ఇంతలో అతడికి భోజనం వచ్చింది.

ముగ్గురూ తినడం పూర్తి చేశారు.

విద్య తిరిగి పుస్తకం అందుకుంది. వాళ్ల తాతయ్య విశ్రాంతిగా వెనక్కి జారబడి చిన్న కునుకు తీయడానికి ఉపక్రమించారు.

శంకర్‌నాగ్


''ఐ యామ్ సారీ విద్యా, మీరు హాండీకాప్డ్ అని నేను గమనించలేదు. ప్రమాదం ఎప్పుడు, ఎలా జరిగింది?'' అడిగాడు నవీన్.

''మూడేళ్ల క్రితం నేను డిగ్రీ సెకండియర్ చదువుతుండగా రోడ్ ఆక్సిడెంట్‌లో పాదం చితికి పోయింది. అప్పటి నుంచి రబ్బరు పాదం పెట్టుకోవాల్సి వచ్చింది'' చెప్పింది విద్య.

''ఇట్స్ రియల్లీ సారీ'' విచారం వ్యక్తం చేశాడు నవీన్.

''విచారం దేనికీ? జరిగిపోయిన దాన్ని మనం మార్చలేం. గతంలో జరిగిన విషాదాన్ని తలచుకుంటూ బాధపడితే వర్తమానంలో ఆనందంగా జీవించే అవకాశాన్ని పోగొట్టుకుంటాం కదా! ప్రమాదం జరిగిన తర్వాత కొన్ని రోజుల పాటు నేను తీవ్రమైన నైరాశ్యానికి లోనయ్యాను. కానీ నాకున్న మరో హాబీ... అదే... ఇంటర్నెట్ బ్రౌజింగ్ . నేను మానసికంగా కోలుకోవడానికి చాలా సహాయపడింది. ఇంటర్నెట్‌లో కొన్ని వెబ్ సైట్లు ఉదాహరణకి అబ్సల్యూట్లీ పాజిటివ్ డాట్ కామ్, పాయింట్ ఆఫ్ లైఫ్ డాట్‌కామ్, ఇన్‌స్పైరింగ్ యు డాట్‌కామ్, ఇన్‌స్పిరేషన్ స్టోరీస్ డాట్‌కామ్ వంటివి నా జీవితంలో తిరిగి ఉత్సాహాన్ని నింపాయి. తర్వాత కొద్దికాలంలోనే నేను తిరిగి మామూలు మనిషినయ్యాను'' చెప్పింది విద్య.

''ఏదేమైనా అంద




రిలా లేనే బాధ మీకుంటుంది కదా...'' అన్నాడు నవీన్.

అతను నిజంగానే తనపై సానుభూతితో ఉన్నాడని గ్రహించిన విద్య మాట మారుస్తూ..

''ఇంతకీ, జీవితంలో మీ లక్ష్యం ఏమిటి?'' అని నవీన్‌ని అడిగింది.

''లక్ష్యాలంటూ పెద్దగా ఏమీ లేవు. చూడాలి. ఎం.బి.ఏ పూర్తి చేసాక, ఏదయినా కంప్యూటర్ కోర్సు చేస్తాను'' చెప్పాడు నవీన్.

''ఆడపిల్లలైనా, మగపిల్లలైనా జీవితంలో ఒక లక్ష్యం కలిగి ఉండాలనేది నా అభిప్రాయం. ఏదైనా సాధించాలనే తపనే మానవజాతి పురోగతికి పునాది. అసలంటూ ఏ లక్ష్యం లేకపోతే మనం చేరేది ఎక్కడికి? నామటుకు నాకు పెయింటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలనే లక్ష్యం ఉంది. గత కొద్దికాలంగా నేను నా లక్ష్యసాధనకు నిర్విరామంగా కృషిచేస్తున్నాను. అందులో భాగంగా 'పర్యావరణం' పై ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన పోటీలో పాల్గొని దేశవ్యాప్తంగా రెండో బహుమతిని గెల్చుకున్నాను. ఆ బహుమతి తీసుకోవడానికే ఇప్పుడు నాగ్‌పూర్ వెళుతున్నాను. మా ప్రయాణం ఏర్పాట్లు ఆ సంస్థే చేసింది'' చెప్పింది విద్య.

సంభ్రమంగా ఆమెనే చూస్తూ ఉండిపోయాడు నవీన్.

''ఇంకో మాట చెప్పనా నవీన్. ఏమనుకోవద్దు. మీరు పోకిరి కుర్రాడిలా అనిపించడంలేదు. కానీ అమ్మాయిలని కోరిక నిండిన కళ్లతో దొంగచూపులు చూడడం కూడా వెకిలి చేష్టలలో భాగమే. బహుశా కళ్లతో తప్పు చేస్తే ఎవరికీ పట్టుబడమనే ధీమా కాబోలు. ఏమైనా, నా శారీరక వైకల్యం కంటే మీ మనో మాలిన్యం మరీ ప్రమాదకరమైంది. దాన్నుంచి మీరు ఎంత త్వరగా బయటపడితే మీకే అంత మంచిది'' చెప్పింది విద్య.

## మహిమా మహిమ!

మహిమా చౌదరి ఈమధ్య చెప్పాపెట్టకుండా (ఎవరికనుకున్నారు, ప్రొడ్యూసర్లకు) స్టేజీ షోలకోసం అబ్రాడ్ వెళ్లిపోయిందట. దాంతో కాల్‌షీట్ల అడ్జస్ట్‌మెంట్ కుదరక జుట్లు పీక్కోవాల్సి వచ్చిందట. కనీసం అజయ్ దేవ్‌గన్‌కు అయినా చెప్పివెళ్తే బావుండని ఓ నిర్మాత గొణిగాడట.

-విశ్లేష

తను ఆమెను దొంగచూపులు చూడడం ఆమె గ్రహించిందని అర్థం చేసుకున్న నవీన్ సిగ్గుతో తల వంచుకున్నాడు.

ఆలోచించగా, ఆమె చెప్పినవన్నీ నిజమేననిపించాయి.

ఇప్పుడతని మనసులో ఆమె పట్ల భావాలు మరోసారి మారాయి.

జాలి స్థానాన్ని గౌరవం ఆక్రమించింది.

మనుష్యులు మారడానికి ఒక్కోసారి చిన్న సంఘటన చాలు. కొందరి ఔన్నత్యం ఎదుటివారి అంతరంగాన్ని పరిశుద్ధం చేసి, వారిలో మరుగున పడిన సంస్కారాన్ని వెలికి తీస్తుంది. ఆ మార్పు తాత్కాలికమా, శాశ్వతమా అనేది వారివారి విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

కొద్దిసేపటి తర్వాత నవీన్ తలెత్తి -''నన్ను క్షమించండి విద్యా! ఇంటర్నెట్‌లో నేను తరచూ చూసే పోర్నోగ్రఫిక్ వెబ్‌సైట్లు నా మనసుని కలుషితం చేసాయి. నేను వివేకం కోల్పోయి ప్రవర్తించాను. ఇంటర్నెట్ నన్ను బలహీనుడిగా మార్చింది..'' అంటూ ఇంకా ఏవో చెప్పబోతుండగా అతని మాటలకి అడ్డువస్తూ...

''ఇంటర్నెట్‌ని తప్పుబట్టి ప్రయోజనం లేదు. టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలనేది మన విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది. దాన్ని నేనెలా సద్వినియోగం చేసుకున్నది చెప్పాను కదా. అంతా మన మానసిక పరిణతిలోనే ఉంది'' అంది విద్య.

నిజమేనన్నట్టు తలూపాడు నవీన్. తర్వాత వాళ్లిద్దరూ ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉన్నారు.

రైలు నాగ్‌పూర్ స్టేషన్‌లో ఆగింది.

''ఆల్ ది బెస్ట్ నవీన్'' అంటూ విద్య తాతయ్య సాయంతో రైలు దిగింది. వెళుతూ వెళుతూ నవీన్ కేసి ఆమె చూసిన చూపులు ''ఏదైనా సాధించి చూపు'' అనే సవాలును విసిరాయి. నవీన్ ఆ సవాలును స్వీకరించాడు. రైలు తన గమ్యం దిశగా ముందుకి కదిలింది. ✪